క్లుప్తంగా

స్పీడ్ బ్రేకర్స్ ఏర్పాటు చేయాలి



కలెక్టరేట్ ఎదురుగా గజిబిజిగా వెళుతున్న వాహనాలు

కడప ఎడ్యుకేషన్ : కడపలోని కలెక్టరేట్ ఎదురుగా ఉన్న ప్రధాన రహదారిలో స్పీడ్ బ్రేకర్స్‌ను ఏర్పాటు చేయాలని కలెక్టరేట్‌కు వచ్చే అర్జీదారులతోపాటు కలెక్టరేట్‌లో పని చేసే ఉద్యోగులు విన్నవిస్తున్నారు. ఈ రహదారిలో నిత్యం వాహనాల తాకిడి అధికంగా ఉంటుందని, దీంతో రోడ్డు దాటాలంటే భయాందోళనకు గురవుతున్నామన్నారు. గతంలో ఉన్న స్పీడ్ బ్రేకర్స్‌ను తొలగించారని, ఆ తరువాత ఎవరూ పట్టించుకోవడం లేదని తెలిపారు. వారంలో రోడ్డుదాటుతూ ఒకరిద్దరు ప్రమాదాలకు గురవుతున్నారని, ఉన్నతాధికారులు స్పందించి స్పీడ్ బ్రేకర్స్‌ను ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

ఎమ్మెల్సీపై దాడి చేసిన వారిని అరెస్ట్ చేయాలి

కడప సెవెన్ రోడ్స్ : ఎమ్మెల్సీ రమేష్ యాదవ్‌పై దాడికి పాల్పడిన వారిని తక్షణమే అరెస్ట్ చేయాలని రాయలసీయ యాదవ కమ్యూనిటీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు జి. నారాయణ యాదవ్ ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎమ్మెల్సీకి తగిన భద్రత కల్పించాలన్నారు. బీసీ వర్గానికి చెందిన ఆయన ఉన్నత స్థానంలో ఉన్నందున కొంత మంది అగ్రవర్ణ నేతలు ఇలాంటి దుశ్చర్యకు పాల్పడటం హేయమన్నారు. యాదవ్‌లపై జరుగుతున్న దాడులను ప్రభుత్వం వెంటనే అరికట్టాలని కోరారు.

రిమ్స్‌లో అన్నదానం



రిమ్స్‌లో అన్నదానం చేస్తున్న హిమవర్షిణి ఫౌండేషన్ సభ్యులు

కడప అర్బన్ : కావేటి పక్కీర వర్ధంతి సందర్భంగా అమెరికాలో ఉంటున్న కుమారుడు డాక్టర్ వంశీ కావేటి, కోడలు డాక్టర్ సుష్మ, కుటుంబ సభ్యులు హిమ వర్షిణి ఫౌండేషన్ ఆధ్వర్యంలో కడప రిమ్స్ హాస్పిటల్ లో గురువారం చికిత్స నిమిత్తం వచ్చే రోగుల సహాయకులకు 300 మందికి అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షురాలు గుండ్లకొండ విజయలక్ష్మి, ఆర్టీసీ కానిస్టేబుల్ గుండ్లకొండ రవి, పుట్టా పురుషోత్తం, వెంకట సురేష్ బాబు, రెడ్డి లక్ష్మణ్, దామోదర్, ఎలక్ట్రీషన్ మధు, గుండ్లకొండ రాఘవేంద్ర, దుర్గ బాబు పాల్గొన్నారు.

ఘనంగా ఠాగూర్ వర్ధంతి



రవీంద్రనాథ్ ఠాగూర్ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న ప్రిన్సిపాల్, తదితరులు

కడప ఎడ్యుకేషన్ : భారతదేశానికి ఎంతో ఉత్తమమైన జనగణమన గీతాన్ని అందించిన మహాకవి రవీంద్రనాథ్ ఠాగూర్ అని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సూర్యారావు అన్నారు. గురువారం కడపలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ఆర్కే రాయల్ సేవా సమితి ఆధ్వర్యంలో రవీంద్రనాథ్ ఠాగూర్ వర్ధంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఆర్కె సంస్థ అధ్యక్షులు రాయల్ కరీముల్లా, అధ్యాపకులు, డాక్టర్ అంజాద్ ఆలీ, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆర్కిటెక్చర్ కోర్సుకు అనుమతి లభించడం ఆనందదాయకం

కడప ఎడ్యుకేషన్ : కడప నగరంలోని డాక్టర్ వైయస్ఆర్ ఆర్కిటెక్చర్, ఫైన్ ఆర్ట్స్ విశ్వవిద్యాలయంలోని కోర్సులకు కూటమి ప్రభుత్వం చొరవతో సీఓఏ (కౌన్సిల్ ఆఫ్ ఆర్కిటెక్చర్) గుర్తింపు లభించడం హర్షణీయమని ఉపాధ్యాయ సంఘాల సమన్వయ వేదిక రాష్ట్ర గౌరవాధ్యక్షులు ఒంటేరు శ్రీనివాసులరెడ్డి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అయితే విశ్వవిద్యాలయంలో ఖాళీగా ఉన్న ఆచార్యుల పోస్టులను వెంటనే భర్తీ చేసేలా చర్యలు తీసుకొని విద్యార్థులకు మంచి విద్య అందేలా చూడాలని ప్రభుత్వాన్ని కోరారు.

నిరుపేద పిల్లలకు ఆధార్ రిజిస్ట్రేషన్

కడప అర్బన్ : సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ ఎస్. బాబా ఫక్రుద్దీన్ ఆధ్వర్యంలో కడపలోని న్యాయ సేవా సదన్‌లో జిల్లా వ్యాప్తంగా 'నిరుపేద పిల్లల కోసం ఆధార్ రిజిస్ట్రేషన్ గత నెల 22 నుంచి ఈనెల 7 వరకు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 573 మంది నిరుపేద పిల్లలు ఆధార్ రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రభుత్వ అధికారులకు, ప్యానల్ న్యాయవాదులకు, పారా లీగల్ వాలంటీర్లకు, అంగన్వాడీ వర్కర్లకు, ఆశా వర్కర్లకు, మహిళా పోలీస్ సిబ్బందికి, ఇతర సిబ్బందికి కృతజ్ఞతలు తెలియజేశారు.

ఎమ్మెల్సీపై దాడి చేయడం దుర్మార్గం

కడపలో మహాత్మా పూలే విగ్రహం ఎదుట నిరసన తెలిపిన బీసీ నాయకులు



పాత బస్టాండులోని మహాత్మా పూలే విగ్రహం ఎదుట నిరసన తెలుపుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

కడప కార్పొరేషన్ : తెలుగుదేశం పార్టీ పులివెందుల జెడ్పీటీసీ స్థానానికి అనైతికంగా పోటీ చేసి...ఆపై దాడులు, దౌర్జన్యాలు చేస్తోందని వైఎస్సార్‌సీపీ బీసీ విభాగం జిల్లా అధ్యక్షుడు ఎన్. శివరామ్ అన్నారు. గురువారం పాతబస్టాండులోని మహాత్మా జ్యోతీరావు పూలే విగ్రహం ఎదుట ప్లకార్డులతో బీసీ నేతలు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎవరైనా పదవిలో ఉండి చనిపోతే వారి కుటుంబంలోని సభ్యున్ని ఎన్నికకు నిలబెడితే అన్ని పార్టీలు మానవతా హృదయంతో అతనికి మద్దతిచ్చి ఏకగ్రీవం చేసే సాంప్రదాయం రాష్ట్రంలో కొనసాగేదన్నారు. ఇప్పుడు పులివెందుల వైఎస్సార్‌సీపీ జెడ్పీటీసీ చనిపోతే ఆ కుటుంబంలోని వ్యక్తినే పోటీకి నిలబెట్టామని, కానీ తెలుగుదేశం పార్టీ నైతిక విలువలకు పాతరేసి బీటెక్ రవి భార్యను పోటీకి దింపిందన్నారు. దాడులు, దౌర్జన్యాలు, అరాచకాలకు కేరాఫ్ అయిన బీటెక్ రవి అధికార బలంతో రెచ్చిపోతూ వైఎస్సార్‌సీపీ నాయకులపై దాడులు చేయించడం దారుణమన్నారు. బీసీ ఎమ్మెల్సీ అయిన రమేష్ యాదవ్, వేల్పుల రాములపై టీడీపీ నాయకులు దాడి చేసి హత్యాయత్నం చేయడం దుర్మార్గమన్నారు. పోలీసులు కూడా సకాలంలో స్పందించి దాడులను అరికట్టలేకపోయారన్నారు. ప్రజాస్వామ్యంలో హింసా రాజకీయాలకు చోటు లేదన్నారు. ఇది బీసీలపై జరిగిన దాడిగా తాము పరిగణిస్తున్నామన్నారు. రాష్ట్ర బీసీ విభాగం ప్రధాన కార్యదర్శి బసవరాజు మాట్లాడుతూ నిష్పక్షపాతంగా పోలింగ్ జరిపితే ఎవరి బలం ఏమిటో తెలిసిపోతుందన్నారు. దాడులు, దౌర్జన్యాలు, బెదిరింపులతో ఎన్నికల్లో గెలుస్తామనుకుంటే సాధ్యం కాదని హెచ్చరించారు. ఈ సందర్భంగా వారు ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు టీపీ వెంకట సుబ్బమ్మ, రాష్ట్ర బీసీ విభాగం కార్యదర్శి కె. శివ యాదవ్, సింధేరవి, ఎస్. బాదుల్లా, బి. మరియలు, మోక్ష తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీపై దాడి చేసిన వారిని అరెస్ట్ చేయాలి

కడప రూరల్ : ఎమ్మెల్సీ ఆర్ రమేష్ యాదవ్ పై దాడి చేసిన వారిని తక్షణం అరెస్టు చేయాలని రాయలసీమ యాదవ కమ్యూనిటీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు జి నారాయణ యాదవ్ తెలిపారు. రమేష్ యాదవ్ పై దాడిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. దాడి చేసిన వారిని ప్రభుత్వం తక్షణం అరెస్టు చేయాలన్నారు. బీసీ వర్గానికి చెందిన రమేష్ యాదవ్ ఎమ్మెల్సీగా ఉన్నత స్థానంలో ఉన్నారని పేర్కొన్నారు. ఉన్నత స్థానంలో ఉన్న వ్యక్తిపై దాడి చేయడం సిగ్గుచేటు అన్నారు. ఆయనకు కట్టుదిట్టమైన రక్షణ కల్పించడంతోపాటు రాష్ట్ర వ్యాప్తంగా యాదవులపై జరుగుతున్న దాడులకు అడ్డుకట్ట వేయాలని తెలిపారు

తాటాకు చప్పుళ్లకు బెదిరేవారు ఎవరూ లేరు

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కిశోర్ బూసిపాటి



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కిశోర్ బూసిపాటి

కడప కార్పొరేషన్ : మాజీ ఎమ్మెల్సీ బీటెక్ రవి తాటాకు చప్పుళ్లకు బెదిరేవారు వైఎస్సార్‌సీపీలో ఎవరూ లేరని ఆ పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కిశోర్ బూసిపాటి అన్నారు. గురువారం జిల్లా పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పులివెందుల జెడ్పీటీసీ గెలుచుకొని వస్తే ముఖ్యమంత్రి చంద్రబాబు రూ.100కోట్లు నిధులిస్తానని జమ్మలమడుగులో చెప్పారని, ఆ నిధుల కోసం బీటెక్ రవి తన భార్యను జెడ్పీటీసీ అభ్యర్థిగా నిలబెట్టారన్నారు. పులివెందుల జెడ్పీటీసీ ఎన్నిక చాలా చిన్నదని, ఈ ఎన్నిక చిన్నదైనా సరే గెలుచుకొని వస్తే రూ.100కోట్ల నిధులు ఇస్తానని చంద్రబాబు చెప్పడంతో బీటెక్ రవిలో అత్యాశ మొదలైందన్నారు. తన భార్య ఓడిపోతుందని తెలిసి, చంద్రబాబు వద్ద కుంటిసాకులు చెప్పి తప్పించుకునేందుకే వైఎస్సార్‌సీపీ నాయకులపై దాడులు చేస్తున్నారన్నారు. ప్రజాస్వామ్యంలో ఎవరు ఎక్కడైనా ప్రచారం చేసుకోవచ్చన్నారు. కానీ ప్రచారం చేస్తున్న వారిపై ఎలాంటి కారణం లేకుండా దాడులకు పాల్పడటం అనాగరికమన్నారు. ఎమ్మెల్సీ రమేష్‌యాదవ్, వేల్పుల రాము లపై టీడీపీ నాయకులు దాడి చేసి హత్య చేసేందుకు యత్నించడం అమానుషమన్నారు. ఎన్ని దాడులు, దౌర్జన్యాలు చేసినా వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, నాయకులు భయపడరని హెచ్చరించారు. 2029లో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వస్తే బీటెక్ రవి ఏ బెంగళూరుకో, హైదరాబాద్‌కో పారిపోక తప్పదన్నారు. నల్లగొండువారిపల్లెలో దాడి జరిగేటప్పుడు పోలీసులు 100 మీటర్ల దూరంలో ఉన్నప్పటికీ నియంత్రించలేకపోయారని, ప్రేక్షక పాత్ర వహించారని విమర్శించారు. ఈ సమావేశంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు డా. పెంచలయ్య పాల్గొన్నారు.

పరిశుభ్రతతోనే మెరుగైన ఆరోగ్యం



కడప అగాడి వీధిలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న డాక్టర్ జమాల్ బాషా

కడప రూరల్ : పరిశుభ్రత తోనే మెరుగైన ఆరోగ్యం సమకూరుతుందని జోనల్ మలేరియా ఆఫీసర్ డాక్టర్ జమాల్ బాషా అన్నారు. గురువారం స్థానిక అగాడి వీధిలో హెల్త్ అవేర్నెస్ ప్రోగ్రాంను పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానికులకు డెంగీ, మలేరియా జ్వరాల గురించి అవగాహన కల్పించారు. దోమల నిర్మూలనకు ప్రతి ఒక్కరు చర్యలు తీసుకోవాలన్నారు. రాత్రిపూట దోమతెరలు వాడాలని సూచించారు. ఇంటి ముందు నీరు నిలువ లేకుండా చూసుకోవాలని పేర్కొన్నారు. పరిశుభ్రత తోనే మెరుగైన ఆరోగ్యం సమకూరుతుందని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ శ్రావణి, సబ్ యూనిట్ ఆఫీసర్ నాగలక్ష్మి రెడ్డి, వరదారెడ్డి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఘన నివాళి

కడప కోటిరెడ్డి సర్కిల్ : శ్రీకృష్ణదేవరాయల 516వ పట్టాభిషేక మహోత్సవం సందర్భంగా గురువారం కడప నగరంలోని కృష్ణ సర్కిల్‌లో ఆయన విగ్రహానికి పూల మాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పొలిట్ బ్యూరో సభ్యులు శ్రీనివాసరెడ్డితోపాటు బలిజ సంక్షేమ సంఘ గౌరవాధ్యక్షులు అమరప్ప, జిల్లా అధ్యుడు సగినాల శ్రీనివాసులు, కార్యదర్శి వెంకటసుబ్బయ్య, బండి బాబు, మస్తాన్ రాయల్, తుంగ రమణ, రమణ, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

సన్మానం

కడప కార్పొరేషన్ : సమాజానికి, సాహిత్యానికి వికాస్ గ్రూప్ ఛైర్మెన్ సుభాన్‌బాషా అందిస్తున్న సేవలు విలువైనవని అమీరున్నీసా ఎడ్యుకేషనల్ అండ్ వెల్ఫేర్ ఫౌండేషన్ ప్రతినిధులు కొనియాడారు. గురువారం ఆయన్ను మర్యాద పూర్వకంగా కలిసి అభినందించారు. ఉర్దూభాషాభివృద్ధి, మైనార్టీల సంక్షేమం, సాహిత్యానికి ఆయన అందిస్తున్న సేవలు మరువలేనివన్నారు. యోగి వేమన విశ్వవిద్యాలయంలో ఉర్దూ గ్రంథాలయం కోసం ఆయన చేసిన ఆర్థిక సాయం, మౌళిక వసతుల కల్పనకు చూపిన చొరవను ప్రస్తావించారు. ఈ సందర్భంగా జరిగిన సన్మాన కార్యక్రమంలో అమీరున్నీసా ఫౌండేషన్ ప్రెసిడెంట్ అన్వర్ హది జూనైది, ఫౌండేషన్ సెక్రటరీ డాక్టర్ సర్దార్ సాహిల్ పాల్గొన్నారు.

నాణ్యతకు, నమ్మకానికి మారుపేరుగా భారతి సిమెంట్

కడప అర్బన్ : భారతి సిమెంట్స్ ఆధ్వర్యంలో గురువారం కడపలోని బార్బేక్యో అనే హోటల్లో ఇంజనీర్స్ మీట్ నిర్వహించారు. కంపెనీ మేనేజర్ ప్రతాప్ రెడ్డి ప్రస్తుత మార్కెట్ పరిస్థితుల గురించి వివరించారు. కంపెనీ టెక్నికల్ డి జీఎం ఓబుల్ రెడ్డి భారతి సిమెంట్ పర్యావరణ పరిరక్షణకు ఎలా పాటుపడుతుందన్న విధానం గురించి కంపెనీ తయారు చేసే పీపీసీ, ఆల్ట్రాఫాస్ట్ మన్నిక గురించి వివరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఏటిఐఎస్ ఇంజనీరింగ్ కళాశాల హెచ్ ఓ డి డాక్టర్ చందన రాబోయే కాలంలో కాంక్రీట్లో జరిగే నూతన ఆవిష్కరణల గురించి వివరించారు. కడప ఎల్ టి పి ఇంజనీర్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో భారతి సిమెంట్ కడప బ్రాంచ్ అసిస్టెంట్ మేనేజర్ రమణారెడ్డి టెక్నికల్ ఇంజనీర్ శ్రీకాంత్ రెడ్డి, నాగేంద్ర, భారతి సిమెంట్ డీలర్స్ పాల్గొన్నారు.

ఉచిత ఇసుక పంపిణీ

పారదర్శకంగా అమలు చేయండి

జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి

కడప అర్బన్ : రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఉచిత ఇసుక పంపిణీ విధానాన్ని పారదర్శకంగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి అధికారులను ఆదేశించారు. గురువారం స్థానిక కలెక్టరేట్‌లో వర్షాకాలం నేపథ్యంలో ఇసుక లభ్యత , ఉచిత ఇసుక పంపిణీ తదితర అంశాలపై జాయింట్ కలెక్టర్ అదితి సింగ్ తో కలసి జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... వర్షాకాల సమయంలో ఇసుక సరఫరా పాయింట్లు నిర్వహించే ఏజెన్సీల కార్యనిర్వాహక ఖర్చుల చెల్లింపు పై చర్చించారు. ప్రజా ప్రయోజనాల దృష్ట్యా ప్రస్తుతం అమలులో ఉన్న రేట్లనే కొనసాగించడానికి నిర్ణయించామన్నారు అయితే, ఏటూరు పి అనంతపురం పూడి కతీత (డిసిల్టేషన్ లకు) సంబంధించి మరొకసారి పరిశీలించి కమిటీ ముందు నివేదిక అందించాలని అధికారులను ఆదేశించారు. సుప్రీంకోర్టులో పెండింగ్ లో ఉన్న ప్రజా ప్రయోజన వ్యాజ్యమునకు సంబంధించి ఆంధ్రప్రదేశ్ అంతరిక్ష పరిశోధనా సంస్థ ఇచ్చిన నివేదికల ప్రకారం జిల్లాలో 2021–2024 మధ్య ఇసుక తవ్వకాలు జరిపిన 69 ప్రదేశాలకు గాను అప్పుడు ఇసుక తవ్వకాలు నిర్వహించిన జై ప్రకాష్ వెంచర్స్ , ప్రతిమా ప్రాజెక్ట్స్ లిమిటెడ్ లకు సంజాయిషీ నోటీసులు జారీ చేయవలసినదిగా తీర్మానించారు. ప్రస్తుతం ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి టాస్క్‌ఫోర్స్‌ను బలోపేతం చేకూర్చే విధంగా మండల స్థాయి టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేయాలన్నారు. ఇసుక పై వచ్చే ఆదాయ వ్యయాలను పర్యవేక్షించడానికి ఒక ఆడిటర్ ను నియమించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో డీఆర్ఓ విశ్వేశ్వర నాయుడు, గనులు భూగర్భ శాఖ డిడి శ్రీవెంకట సాయి, సంబంధిత ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

హాస్టల్ విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలి

కడప ఎడ్యుకేషన్: జిల్లావ్యాప్తంగా ఉన్న సంక్షేమ హాస్టల్స్ విద్యార్థుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించాలని పీఎస్ఎఫ్, ఏఐబీఎస్ఎస్, ఏఎస్వైఎఫ్ విద్యార్థి సంఘాలు డిమాండ్ చేశారు. ఈ విషయమై గురువారం జిల్లా రెవెన్యూ అధికారి విశ్వేశ్వర్ నాయుడును కలెక్టరేట్‌లో కలిసి వారు వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా పీఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు కొడవంటి నాగరాజు మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా వార్డెన్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని కోరారు. విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలన్నారు. చాలా వసతి గృహాలు చిన్నపాటి వర్షానికి కూడా ఉరుస్తున్నాయన్నారు. దీంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఆల్ ఇండియా బంజారా స్టూడెంట్ సంఘ్ కడప జిల్లా అధ్యక్షులు రమావత్ జగన్ రాథోడ్, అంబేద్కర్ స్టూడెంట్ యూత్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు ఓబయ్య తదితరులు పాల్గొన్నారు.



నల్లపురెడ్డిపల్లెలో జడ్పీటీసీ ఎన్నికల ప్రచారానికి వెళుతున్న ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, తదితరులు



నల్లపురెడ్డిపల్లె శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, తదితరులు

వర్షాభావ పరిస్థితుల్లో ప్రత్యామ్నాయం మేలు



ఏడీఏల సమావేశంలో మాట్లాడుతున్న వ్యవసాయ పరిశోధన కేంద్ర ప్రధాన శాస్త్రవేత్త ప్రభాకర్‌రెడ్డి

కడప అగ్రికల్చర్ : జిల్లాలో వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో రైతన్నలు ప్రత్యామ్నాయ పంటలసాగువైపు వెళ్లడం మంచిదని ఊటుకూరు వ్యవసాయ పరిశోధన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం ఊటుకూరు వ్యవసాయ పరిశోధన కేంద్రంలో జిల్లాలోని వ్యవసాయ ఉపసంచాలకులకు శిక్షణ, సందర్శన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా జిల్లాలో సాగులో ఉన్న పంటలు వాటి పరిస్థితి ఇప్పటివరకు పడిన వర్షాలు సాగయిన పంటల గురించి ఏడీఏలు వివరించారు. అనంతరం ఊటుకూరు వ్యవసాయ పరిశోధన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటివరకు సరైన వర్షపాతం లేనందున పంటల సాగు విస్తీర్ణం తగ్గిందన్నారు. ప్రస్తుతం ప్రత్యామ్నాయ పంటల వైపు రైతులు వెళ్లడం మంచిదన్నారు. ప్రత్యామ్నాయ పంటలైన కంది, ఆముదము, అనప, పత్తి పంటలను సాగు చేసుకోవచ్చని తెలిపారు. ప్రత్యామ్నాయ పంటలలో యాజమాన్య పద్ధతులు, తెగుళ్ల నివారణ గురించి కృషి విజ్ఞాన కేంద్రం సమన్వయకర్త వీరయ్య, వనిపెంట కృషి విజ్ఞాన కేంద్రం సమన్వయకర్త బాలకృష్ణ, వ్యవసాయ శాస్త్రవేత్తలు సునీల్ కుమార్ మాధురిలు వివరించారు. ఈ కార్యక్రమంలో ఏడీఏలతోపాటు శాస్త్రవేత్త విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ లెక్చరర్ల సమస్యలను పరిష్కరించాలి



డిగ్రీ కళాశాలలో నల్లబాడ్జీలతో నిరసన తెలుపుతున్న అధ్యాపకులు

కడప ఎడ్యుకేషన్ : డిగ్రీ కళాశాలల్లో పనిచేస్తున్న అధ్యాపకుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించాలని జిసిజిటిఏ, జీసిటిఏ లెక్చరర్ల అధ్యాపక సంఘ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం కడప ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా కళాశాలలో డిగ్రీ లెక్చరర్లు తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ నల్లబాడ్జీలను ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది సాధారణ బదిలీలు, అర్హత కలిగిన అధ్యాపకులకు బోధన, బోధనేతర సిబ్బందికి పదోన్నతులు కల్పించాలన్నారు. అనంతరం ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా కళాశాలల డిగ్రీ లెక్చరర్ల జేఏసీ జిల్లా నాయకులు, సభ్యులు కలిసి కళాశాల ప్రిన్సిపాల్ సలీంబాషకు వినతిపత్రాన్ని సమర్పించారు. అనంతరం నల్లబాడ్జిలతో విధులకు హాజరయ్యారు. జిసిటిఏ తరపున డా. సి.వి. కృష్ణవేణి, ఎ. హరిత, డాక్టర్ బి. స్వరూప, కె. నమ్రత, పి. సుజాత, డాక్టర్ ప్రకాష్ రెడ్డి, జి.సి.జి.టి.ఎ. తరపున డా. పి. శచీ దేవిలు పాల్గొన్నారు.

వైవీయూలో జాతీయ చేనేత దినోత్సవం



సాంప్రదాయ దుస్తులతో వైవీయూ విద్యార్థులు

కడప ఎడ్యుకేషన్ : యోగివేమన విశ్వవిద్యాలయంలో జాతీయ చేనేత దినోత్సవం విశ్వవిద్యాలయ ఎన్ఎస్ఎస్ యూనిట్ -9 ఆధ్వర్యంలో నిర్వహించారు. జాతీయ చేనేత దినోత్సవంలో భాగంగా విద్యార్థులు సాంప్రదాయ దుస్తులు ధరించి నేతన్నల కష్టాలను గుర్తుచేశారు. బ్రిటిష్ కాలంలో విదేశీ వస్త్రాలను బహిష్కరించి స్వదేశీ వస్త్రాలను ధరించాలని గాంధీజీ పిలుపునిచ్చారని తెలిపారు. భారత ప్రధానమంత్రి నరేంద్రమోడీ జాతీయ చేనేత దినోత్సవం నిర్వహించాలని, నేతన్నలకు గిట్టుబాటు ధరతో పాటు స్వదేశీ వస్త్రాలను ధరించి ఆదరించాలని సూచించిన విషయాన్ని గుర్తు చేశారు. ఎన్ఎస్ఎస్ యూనిట్ -9 వలంటీర్లు సాంప్రదాయ దుస్తులు ధరించి రాంప్ మీద నడిచి చేనేతవర్గాల గొప్పతనాన్ని తెలియచెప్పారు. ఈ కార్యక్రమంలో వాలంటీర్లు పాల్గొన్నారు.

పీఆర్ రిటైర్డ్ ఉద్యోగుల సంక్షేమమే ధ్యేయం



మాట్లాడుతున్న రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు షేక్ రియాజ్ అహ్మద్

కడప సెవెన్ రోడ్స్ : పంచాయితీరాజ్ రూరల్ డెవలప్‌మెంట్ అలాగే ఇంజనీరింగ్ విభాగ విశ్రాంత ఉద్యోగుల సంక్షేమమే తమ ధ్యేయమని పీఆర్ విశ్రాంత ఉద్యోగుల సంఘం రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు షేక్ రియాజ్ అహ్మద్ అన్నారు. గురువారం జిల్లా పరిషత్ ఆవరణంలో డీపీఆర్సీ సమావేశ మందిరంలో నిర్వహించిన ఆ సంఘ జిల్లా కార్యవర్గ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రిటైర్డ్ ఉద్యోగ పెన్షనర్ల, ఫ్యామిలీ పెన్షనర్ల సమస్యలు ఉంటే తెలపాలన్నారు. సమస్యలను ప్రభుత్వ అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. తమ సంఘం బలోపేతానికి జోన్-4 నాలుగు జిల్లాలకు జోనల్ కో-ఆర్డినేటర్‌గా రిటైర్డ్ ఇంజనీర్ షేక్ హబీబ్‌ను నియమిస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎంవి రంగాచార్యులు, జిల్లా ఉపాధ్యక్షుడు కేశవులు, కో-ఆర్డినేటర్ ఎంవి నరసింహులు, రిటైర్డ్ డీఎల్‌డీవో ఐ. బాల మునెయ్య, రిటైర్డ్ ఎంపిడివోలు జి. రవికుమార్ రెడ్డి, హెచ్. రామదాసు, రిటైర్డ్ ఏవో సుభాన్, రిటైర్డ్ ఏఈ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

ముస్లిం, మైనార్టీలను మోసం చేస్తున్న ప్రభుత్వం

కడప కార్పొరేషన్ : కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీలు అమలు చేయకుండా ముస్లిం, మైనార్టీలను మోసం చేస్తోందని వైఎస్సార్‌సీపీ మైనార్టీ కడప నియోజకవర్గ అధ్యక్షుడు ఎస్ఎండీ షఫీ విమర్శించారు. గురువారం ఆయన ఒక పత్రికా ప్రకటన విడుదల చేశారు. 2024– 25 సంవత్సరంలో మక్కా యాత్ర చేసిన 18 వేల మంది మైనార్టీలకు ప్రభుత్వం ఒక్క రూపాయి కూడా సాయం చేయలేదన్నారు. 2023–24లో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మక్కా యాత్ర కోసం రూ.14.05కోట్లు బడ్జెట్‌లో కేటాయించారన్నారు. ఇలా ఒక్కొక్క యాత్రికుడికి రూ.80వేలు ఇవ్వాల్సి ఉందని, కానీ కూటమి ప్రభుత్వం ఆ నిధులు ఇవ్వకుండా ముస్లింలను మోసం చేసిందన్నారు. బెంగళూరు, హైదరాబాద్, చెన్నై, ముంబై ఇలా ఎక్కడి నుంచి మక్కాయాత్రకు వెళ్లినా ప్రభుత్వం రూ.18వేలకుపైగా సబ్సిడీ ఇవ్వాల్సి ఉందని, కానీ 71 మందికి మాత్రమే ఇచ్చి చేతులు దులుపుకున్నారన్నారు. 9 నెలల నుంచి ఇమామ్‌లు, మౌజన్‌లకు ఆర్థిక సాయం చేయకుండా ప్రభుత్వం మొద్దు నిద్ర పోతోందన్నారు. టీడీపీలో ఉన్న ముస్లిం మైనార్టీ నాయకులు ప్రభుత్వం దృష్టికి తీసుకుపోయి వీటిని పరిష్కరించాలని కోరారు.

ఎర్రిపల్లెలో వైఎస్సార్‌సీపీ ఎన్నికల ప్రచారం



మహిళతో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు డాక్టర్ ఇసీ దినేష్‌రెడ్డి, నరేన్‌రెడ్డి



వృద్ధుడిని ఆప్యాయంగా పలకరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు డాక్టర్ ఇసీ దినేష్‌రెడ్డి

పులివెందుల టౌన్ : పులివెందుల జెడ్పీటీసీ ఉప ఎన్నికలో భాగంగా పులివెందుల మండలం ఎర్రిపల్లె గ్రామంలో గురువారం సాయంత్రం వైఎస్సార్‌సీపీ నాయకులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ ఎన్నికల ప్రచారంలో వైఎస్సార్‌సీపీ నాయకులు డాక్టర్ ఇసీ దినేష్‌రెడ్డి, నరేన్‌రెడ్డిలు ప్రతి ఇంటికి వెళ్లి ఎన్నికలలో ఫ్యాన్ గుర్తుకు ఓట్లు వేసి జెడ్పీటీసీ అభ్యర్థి హేమంత్‌రెడ్డిని అఖండ మెజార్టీతో గెలిపించాలన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ ఇసీ దినేష్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజాస్వామ్యం అమలు కావడంలేదని, ఎమ్మెల్సీలపైనే దాడికి యత్నిస్తుంటే సామాన్య ప్రజల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. ప్రస్తుతం సంక్షేమ పథకాలేవి ప్రజలకు అందడంలేదన్నారు. చంద్రబాబు మోసాలను ప్రజలు గ్రహించారన్నారు. శాంతియుత వాతావరణంలో ఎన్నికలు జరిపితే వైఎస్సార్‌సీపీ జెడ్పీటీసీ అభ్యర్థి విజయం ఖాయమన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలతోపాటు పెద్ద ఎత్తున పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.